
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

3★★

ఆదివారం 8 డిసెంబరు 2024

న్యూస్ బాక్స్

జిల్లా వాసికి బాక్సింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకున్న పాదం మహేందర్

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకు చెందిన క్రీడాకారుడు పాదం మహేందర్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని దుర్గాపూర్‌లో జరిగిన సీఐఎస్ఎఫ్ ఆల్ ఇండియా బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. జిల్లాలోని గొల్లపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన సీఐఎస్ఎఫ్ పారా మిలిటరీ జవాన్ పాదం మహేందర్ సౌత్ జోన్ నుంచి ఆల్ ఇండియా బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొని తన ప్రత్యర్థి ఏర్ఫోర్డ్ సెక్టార్ క్రీడాకారున్ని రెండవ రౌండ్‌లోనే నాకౌట్ చేసి జాతీయ స్థాయి బంగారు పతకాన్ని సాధించారు. సీఐఎస్ఎఫ్ స్పోర్ట్ ఆఫీసర్ డిప్యూటీ కమాండర్ వికాస్ సింగ్, కోచ్ మైసూర్, బాక్సింగ్ ఫెడరేషన్ సెక్రటరీ రవీందర్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ గువ్వ శ్రీనివాస్, సభ్యులు జలపతి, రాజు, రాజేందర్, అరుణ్, మహిపాల్, సోని, రవీందర్ అభినందించారు.

పప్పులు, ఉప్పుల ధరలు పెరిగిపోయే. మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసేటట్లు లేకపోయే. వచ్చే జీతం తక్కువ. అప్పో...సొప్పో చేసి వంట చేయడం తప్పదు. నెలలు గడుస్తున్నా బిల్లులు రావయే. ఐదు రూపాయల చొప్పున వడ్డీకి తెచ్చినా వచ్చే బిల్లులు సకాలంలో రాక పోవడం....అప్పులు ఇచ్చినోళ్లు ఆగుత లేరాయే. ఏం చేద్దాం... ఇదీ వంట ఏజెన్సీ ఓ నిర్వాహకురాలి ఆవేదన.



జగిత్యాలలో ఆందోళన చేస్తున్న వంట కార్మికులు



బిల్లులు వచ్చేదెన్నడో?

పేరుకుపోయిన మధ్యాహ్న భోజన బకాయిలు

పెరిగిన కూరగాయలు, గుడ్డు ధరలతో ఇక్కట్లు

రూ. 10,500 గౌరవ వేతనం పెంచాలని డిమాండ్

సమస్య పరిష్కరించకుంటే సమ్మెకు దిగేందుకు నిర్ణయం

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు అందక, నెల నెల వేతనాలు రాక వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నెలలుగా భారీ మొత్తంలో బిల్లులు బకాయిలు పేరుకుపోవడంలో పడరాని పాట్లు పడుతున్నారు. పాత అప్పు తీరడం లేదు..కొత్తగా అప్పు పుట్టడం లేదు. మరో వైపు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో మధ్యాహ్న భోజనం నిర్వహణ భారంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం ఏజెన్సీలకు బిల్లులు సకాలంలో అందడం లేదు. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే సంకల్పంతో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ పథకం అమలు గాడి తప్పింది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లాలోని 783 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 55 వేలకు పైగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోంది. ఇందులో సుమారు 38 వేలు ప్రాథమిక, సుమారు 17 వేలు ప్రాథమికోన్నత పాఠశాలలున్నట్లు విద్యాశాఖ రికార్డులు తెలుపుతున్నాయి. (తరువాయి 6వ పేజీలో)

పకడ్బందీగా ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుల సర్వే

ఇంటర్వ్యూ

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి



జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, సర్వే పకడ్బందీగా నిర్వహించడానికి కార్యాచరణ ప్రారంభించాము. ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది..జిల్లాలో సర్వే నిర్వహించి యాప్‌లో వివరాలను నమోదు చేయడానికి అనుగుణంగా ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశాము. లబ్ధిదారులను ఎంపిక సక్రమంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారులపై సర్వే పనులు జరుగుతున్నాయా..?

అదనపు కలెక్టర్: ఇందిరమ్మ ఇంటి సర్వేను పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని గుర్తించి యాప్‌పై శిక్షణను పూర్తి చేశాము. అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఇందిరమ్మ ఇంటి కోసం ఎన్ని దరఖాస్తులు స్వీకరించారు..సర్వేలో ఎంతమంది ఉద్యోగులు, సిబ్బందిని భాగస్వామ్యం చేస్తున్నారు..?

అదనపు కలెక్టర్: జిల్లా వ్యాప్తంగా అయిదు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో సుమారు రెండు లక్షల వరకు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు వచ్చాయి. సుమారు 380 మంది పంచాయతీ సెక్రటరీ, సుమారు 110 మంది వార్డు ఆఫీసర్లు, ఇతర ఉద్యోగులకు సర్వే బాధ్యతలు అప్పగించాము. ప్రతీ 500 దరఖాస్తులకు ఒక సర్వే అధికారిని నియమించాము.

ఆంధ్రజ్యోతి: సర్వేలో ఎటువంటి అంశాలను పరిశీలించనున్నారు..?

అదనపు కలెక్టర్: వచ్చిన దరఖాస్తులలో వివిధ అంశాలను సర్వే అధికారులు పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తారు. ప్రధానంగా దరఖాస్తుదారుని ఫొటో, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫొటో, ఇంటిపై కప్పు ఫొటో, అద్దె ఇల్లు అయితే వాటి వివరాలు, ఫొటోలు, సొంత స్థలం ఉన్నదా..లేదా అనే అంశం, ఒక వేళ సొంత స్థలం ఉంటే దాని వివరాలు, సంబంధిత డాక్యుమెంట్స్, స్థలం ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దరఖాస్తుదారుని ఆర్థిక పరిస్థితి, సామాజిక వివరాలు పరిశీలిస్తారు.

ఆంధ్రజ్యోతి: ఎప్పటివరకు సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు..?

అదనపు కలెక్టర్: ఈనెల 8వ తేదీ నుంచి సర్వేను ప్రారంభించనున్నారు. యాప్‌లో వివరాలు, ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈనెల 20వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాము. సర్వే అధికారులకు దరఖాస్తు దారులు సహకరించాలని సూచిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో టీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై దృష్టి సారిస్తున్నారా..?

అదనపు కలెక్టర్: జిల్లాలో గ్రూప్-2 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించడానికి దృష్టి సారించాము. జిల్లా వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ, 16వ తేదీలలో గ్రూప్ - 2 పరీక్షలు జరగనున్నాయి.

ఆంధ్రజ్యోతి: పరీక్ష నిర్వహణకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు..ఎంత మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు..?

అదనపు కలెక్టర్: జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు 35 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాము. జిల్లాలోని జగిత్యాల, మల్యాల, కొండగట్టు జెఎన్‌టీయూ, కోరుట్ల తదితర ప్రాంతాల్లో కేంద్రాలు ఎంపిక చేశాము. సుమారు 10,900 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేసిన

ఘనత కాంగ్రెస్‌దే

ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

6

అంగరంగ వైభవంగా..

సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అయ్యప్ప స్వాములు

5

జిల్లాను ముందువరుసలో ఉంచేందుకు

ఉద్యోగులు కృషి చేయాలి : కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులలో జిల్లాను ముందు వరసలో ఉంచడానికి ఉద్యోగులు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను ఇటీవల నూతనంగా ఎన్నికయిన టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డితో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడు యండి వకీలు, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి అమరేందర్ రెడ్డి, నాయకులు సాహేద్ బాబు, రవీందర్, రాజేశం, సుగుణాకర్, మధుకర్, శ్రీనివాస్, హరిప్రసాద్, కుమార స్వామి, సంపత్, మహేశ్, మమత, శ్రావణి, ఇంద్రజ పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించేలా సహకరించాలి

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అలియా మక్సూద్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జనరల్ విభాగం, ఉర్దూ విభాగం బోధనా సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు తిరుపతి, రిజ్వానా, తిరుపతిరెడ్డి, సునీత, శిల్ప, శ్రీలత, మాదవి, జగన్, రాజయ్య, సుమేరా, సాజిద్, మజిద్, స్వరూప పాల్గొన్నారు.

భూనిర్వాసితులతో ఆర్డీవో సమావేశం

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెటలో శనివారం సూరమ్మ చెరువు ఎడమ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో కోరుట్ల ఆర్డీవో జికేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. దుంపెటలో 28 ఎకరాల భూమి రైతులు కోల్పోతుండగా రైతులతో మాట్లాడారు. గీత కార్మికులకు చెందిన సుమారు 10 ఎకరాలు భూమి కోల్పోతుండగా సంఘ సభ్యులు తమకు గిట్టుబాటు ధరలు చెల్లించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్ ఉన్నారు.

ఆసియా వలస సంఘాల ఐక్య వేదిక డైరెక్టర్‌గా బీంరెడ్డి

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా అంతర్జాతీయ వలస కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్న మైగ్రంట్ ఫోరం ఇన్ ఏసియా (ఎంఎఫ్ఏ) అను ప్రముఖ సంస్థకు బోర్డు ఆఫ్ డైరెక్టర్‌గా జగిత్యాలకు చెందిన వలస కార్మిక నేత మంద బీంరెడ్డి ఎన్నికయ్యారు. శనివారం థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఎంఎఫ్ఏ సర్వ ప్రతినిధి సభలో ఈ ఎన్నికలు జరిగాయి. ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అను సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న బీంరెడ్డి ఎంఎఫ్ఏ డైరెక్టర్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ కాల పరిమితి రెండేళ్లుగా ఉంటుంది.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో 4వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో శరీరక ధారుడ్యంతో మాట్లాడుతూ స్నేహభావం పెంపొందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, బేస్ బాల్ స్టేట్ సెక్రెటరీ శ్వేత, కౌన్సిలర్ చుక్క నవీన్, చెటిపెల్లి సుధాకర్, అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, గంగాధర్, అనందరావుపాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జ్ఞాన సంపదతో ఉన్నత శిఖరాలకు

పిల్లలలో చిన్నతనం నుంచే శాస్త్ర, సాంకేతికత వైపు ప్రోత్సహించడం వల్ల భవిష్యత్‌లో ఉన్నత స్థానాల వైపు ఆకర్షితులవుతారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2024-25 ముగింపు కార్యక్రమంలో పాల్గొని వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, యువతను, విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడివాల జ్యోతి, డీసీఎం ఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా విద్యాధికిరి రాము నాయక్, రాజమౌళి, రాజశేఖర్, అనందరావు, దేవయ్య పాల్గొన్నారు.

●జగిత్యాల పట్టణానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే ఎల్‌వోసి అందజేశారు. వివిధ కారణాల అనారోగ్యంతో బాధ పడుతున్న పట్టణానికి చెందిన సునీల్‌కు 2.50 లక్షలు, సరోజనకు 1.10 లక్షలు, జి. శైలజకు 1.50 లక్షలు విలువైన చెక్కలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్‌లు కూసరి అనిల్, పంబాల రాంకుమార్ పాల్గొన్నారు.

వెలమ సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్, పక్కన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) జిల్లా పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి కొలగూరు దామోదర్‌రావు శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాష్ట్రంలో అన్ని కుల సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు.

పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా అయిల్నేని సాగర్‌రావు, ఉపాధ్యక్షుడిగా బండారి దివాకర్‌రావు, కార్యదర్శిగా దన్నపునేని వేణుగోపాల్ రావు, సంఘటిత కార్యదర్శులుగా అయిల్నేని రవీందర్‌రావు, ఇమ్మనేని ప్రశాంత్‌రావు, కార్యవర్గ సభ్యులుగా మెన్నేని సరెందర్ రావు, యచమనేని అజయ్ రావు, పునుగోటి సురేందర్ రావు, కలకుంట్ల రాంప్రసాద్‌రావు, మెన్నేని ప్రవీణ్‌రావు, తాండ్ర అనిల్ రావు, మహిళ కార్యవర్గసభ్యులుగా బల్మూరి సరళ, హరిప్రియ, శ్రీలత ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఉపాధ్యక్షుడు దివాకర్‌రావు పాల్గొన్నారు.

అకాల వర్షం..తడిసిన ధాన్యం

బీర్‌పూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి బారీగా వర్షం కురిసింది. బీర్‌పూర్ మండలంలో గల కొల్వాయి గ్రామంలో అధిక వర్షపాతం నమోదైంది. కొల్వాయి, తాళ్ళధర్మారం, మంగేళ, కమ్మునూర్ గ్రామాలలోని వరి ధాన్యపు కుప్పలు, వడ్ల బస్తాలు పాక్షికంగా తడిసి పోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా తూకం వేయాలని రైతులు కోరుతున్నారు. వర్షంతో ఆరెపెల్లి, చిన్న కొల్వాయి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారాయి.

వెల్గటూర్: మండలంలోని కొన్ని ప్రాంతాలలో శనివారం స్వల్పంగా వర్షం కురవడంతో ధాన్యం పాక్షికంగా తడిచింది. మండలంలో చిరు జల్లులు పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధాన్యం తడువ కుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు కప్పడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరుగులు తీశారు. తూకం వేసిన బస్తాలు పాక్షికంగా తడిచాయి.

కల్తీ పాల అమ్మకంపై ఆందోళన

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలో శనివారం కల్తీ పాలు కలకలం రేపాయి. నిత్యం పాలు తీసుకునే కుటుంబ సభ్యులు అనుమానంతో నిఘా పెట్టడంతో అసలు విషయం తెలిసింది. జగిత్యాల పట్టణానికి చెందిన కరబూజ లావణ్య కుటుంబం మేడిపెల్లి మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర పాలు కొంటున్నారు. కొన్ని రోజులుగా లావణ్యతో పాటు ఆమె పిల్లలకు విరేచనాలు కావడంతో ఆసుపత్రి వెళ్లినా ఫలితం కనిపించకపోవడంతో పాలు డెటాల్ వాసన రావడంతో అనుమానం వచ్చి పాలను వేడి చేయకుండా పక్కనపెట్టారు. తెల్లవారి వేడి చేసినా పాలు పలగక పోవడంతో ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పరీక్షలు చేయించగా పాలలో పది శాతం కూడ పాలు లేవని నిర్ధారించారు. పాలను స్వాధీనం చేసుకుని జగిత్యాల మున్సిపల్ ఆఫీసుకు తరలించారు. మల్లయ్య పై కేసు నమోదు చేసినట్టు ఫుడ్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. తాను పాలు విరగకుండా బేకింగ్ సోడా కలిపాలని మల్లయ్య పేర్కొనడం కొస మెరుపు.

విద్యా సంస్థల బలోపేతానికి ప్రధాని మోదీ కృషి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణిప్రవీణ్


ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విద్యాసంస్థల బలోపేతానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. జగిత్యాలకు నవోదయ విద్యాలయాన్ని ప్రకటిస్తూ కేంద్ర క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రధానీ నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్, నిజామాబాద్ ఎంపీ ధర్మ పురి అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని పురాణిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్ మాట్లాడారు. జగిత్యాలకు నవోదయ విద్యాలయం మంజూరు చేసిన ప్రధానీ మోదీతో పాటు కృషి చేసిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల బీజేపీ నాయకులు ఆమద రాజు, రాజన్న, మమత, పవన్, రాజేందర్, రమేశ్, రాజగోపాల్, జీవన్, రవితేజ, పుష్ప, పద్మ, కవిత, లక్ష్మీ, భానుప్రియ, మంజు పాల్గొన్నారు.

రాయికల్: జగిత్యాల జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు రాయికల్ అంగడి బజార్‌లో బీజేపీ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్ చార్జి బోగ శ్రావణి, పట్టణ, మండల అధ్యక్షులు కల్లెడ ధర్మపురి, అన్నవేణి వేణు, భూపతిపూర్ సింగిల్‌విండో చైర్మన్ ముత్యంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్ : జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూర్ చేయడం అభినందనీయమని బీజేపీ నాయకులు అన్నారు. జిల్లాకు నవోదయ పాఠశాల మంజూర్ పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ అర్వింద్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, బీజేపీ నాయకులు రుద్ర శ్రీనివాస్, దొనికెల నవీన్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన మోదేపల్లి శివకుమార్(25) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. శివకుమార్ అదే గ్రామానికి చెందిన యువతిని నాలుగు సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఏడాది వయస్సు గల కూతురు ఉంది. శివకుమార్ కొంతకాలం ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేశాడు. జీతం సరిపోవటం లేదని మూడు నెలల కిందట ఉద్యోగం మానేశాడు. ఇంటివద్దనే ఉంటూ ప్లంబర్ పనిచేస్తుండేవాడు. డబ్బులు లేక కుటుంబపోషణ భారమవుతోందని శివకుమార్ బాధపడుతుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం రాత్రి బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండటంతో అక్కడి వెళ్లి తిరిగి రాత్రి శివకుమార్ ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు చూసే సరికి శివకుమార్ ఉరికి వేలాడు తూ కనిపించాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం


కనకయ్య(ఫైల్)

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై శుక్రవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందు తూ మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నుస్తులాపూర్ గ్రామానికి చెందిన తమ్మనబో యిన కనకయ్య(63) తన గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి గొర్రెలను తరలిస్తూ రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వస్తున్న ఆటో (టీఎస్36టీ5538) కనకయ్యను ఢీకొట్టింది. కనకయ్య కింద పడి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మానకొండూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన గొండ పెద్దన్న(65) అనే సింగరేణి విశ్రాంత ఉద్యోగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా పెద్దన్నకు ఇంటిముందు ఉన్న ఖాళీ స్థలం విషయంలో పక్కింటి వారితో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపా నికి గురై గత నెల 21న నిద్రమాత్రలు వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. 17 రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువతి మృతి

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఎల్కపల్లి శిరీష (22) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన మైస శ్రీనాథ్ అనే వ్యక్తి శిరీషను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. దీంతో పాటు ఆమెను మానసికంగా వేధించడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 5వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం శిరీష మృతి చెందింది. శిరీష తల్లి ఎల్కపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆమె ఆత్మహత్యకు కారణమైన మైస శ్రీనాథ్, మైస సుశీల, మైస సారయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ఎల్లారెడ్డిపేట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గొల్లపల్లి బస్టాండ్ సమీపంలోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన అదే గ్రామానికి చెందిన మహిళ లక్ష్మి నిలబడి ఉంది. బోప్పాపూర్ లోని వ్యక్తి బోండ్ల బాలకిషన్ తన ద్విచక్ర వాహనంపై యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మహిళను ఢీ కొట్టినాడు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తంగళ్లపల్లిలో చోరీ


పగుల గొట్టి ఉన్న బీరువా

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో కోడం విజయ ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ. 90 వేల నగదు ఎత్తుకెళ్లారు. వారంరోజుల క్రితం కోడం విజయ కుటుంబం ముంబాయి వెళ్లగా శనివారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రామ్మోహన్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మానాల అటవీ ప్రాంతం



ఉద్యమాల చిరునామా మానాల

- నాడు సాయుధ శిక్షణ కేంద్రంగా అడవులు
- నేడు కనుమరుగవుతున్న వృక్ష సంపద
- అటవీ భూములను ఆక్రమిస్తున్న అక్రమార్కులు
- రక్షించాలని కోరుతున్న ప్రజలు


మానాలలో అమర వీరుల స్తూపం

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల అడవులకు ఎంతో ఉద్యమ చరిత్ర ఉంది. మానాలలోని అడవులు, గుట్టల్లో సాయుధ దళాలకు శిక్షణ శిబిరాలను నిర్వహించేవారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మావోయిస్టు దళాల సభ్యుల వరకు ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఉద్యమాల్లో భాగస్వాములయ్యేవారు. ఆయా ప్రాంతాల్లో పోరాటాల్లో గాయపడిన సభ్యులకు ఈ ప్రాంతానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించేవారు. ఆ ఆనవాళ్లు ఇప్పుడు కనుమరగవుతున్నాయి. అక్రమార్కుల గొడ్డలి వేటుకు మానాల అడవుల్లోని వృక్ష సంపద, గుట్టలు అంతరించిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దులోని మానాల గిరిజన ప్రాంతం. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుంచి సిరిసిల్ల జిల్లా పరిధిలోకి మారింది. లోకం పోకడ ఎరుగని మారుమూల పల్లె మానాల, అక్కడి మనుషులకు ప్రపంచంతో సంబంధాలు ఉండేవి కావు. కానీ మానాల అంటే చరిత్ర పుటల్లో మాసిపోని పోరాట వేదిక. అమాయకులైన ఇక్కడి ప్రజలు అనేక పోరాటాలను గుండెల్లో పెట్టుకున్నారు. మానాల ఆడవులు దట్టమైనవి కావడంతో తెలంగాణ సాయుధ పోరాటంలో గెరిల్లా దళాలకు ఇక్కడ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తెలంగాణ రైతాంగ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద మహిళా అమరవీరుల రెండో స్తూపం ఇక్కడ నిర్మించారు.

● అడవుల్లోకి భూ అక్రమార్కులు

ఉద్యమ చరిత్ర ఉన్న మానాల అడవుల్లోకి భూ అక్రమార్కులు చొరబడ్డారు. చెట్లను అక్రమంగా నరుకుతూ భూములను చదును చేస్తున్నారు. చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకొని అటవీ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. వ్యవసాయ భూములుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని బుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి మొదలుకొని మానాల వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న గాది గుట్ట తండా వరకు అటవీ ప్రాంతంలో సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు వృక్ష సంపదను నేల మట్టం చేశారు. సీమర్ల అటవి ప్రాంతంలోనూ భారీ వృక్షాలను నరికి వేశారు. మానాల గ్రామం శివారులో కొన్ని సంవత్సరాల క్రితం అటవీ ప్రాంతం అన్యాక్రాంతం కావడంతో అప్పటి అటవీ అధికారులు సుమారు 40 ఎకరాల్లో నీలగిరి మొక్కలతో ప్లాటేషన్ చేశారు. అయితే అవి వృక్షాలుగా మారాయి. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి నీలగిరి చెట్లను నరికి భూములను ఆక్రమించేందుకు కొందరు, కలపను అమ్ముకునేందుకు మరికొందరు చెట్లను నరికి వేస్తున్నారు. అంతే కాకుండా ఎంతో విలువైన టేకు కలప, వన మూలికల చెట్లను నరికి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. దీంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి చేరుతున్నాయి. అంతరించి పోతున్న అడవులను కాపాడాలని రెండు జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.


నరికివేతకు గురైన వృక్షం

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని బియ్యాన్ని, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్ కుమార్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ నుంచి వేములవాడ వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు వేములవాడ పట్టణ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంకెపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఒక వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా నిరంతర నిఘా పెడుతూ విస్తృతస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వేములవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్ గ్రామ శివారులోని ఎస్ఆర్ఆర్ రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు డీటీసీఎస్ రవీంద్రచారి తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. హుజూరాబాద్ నుంచి ఎనగల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుకు తరలిస్తున్న 70 క్వింటాళ్ల బియ్యం, రైస్‌మిల్లును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిరిసిల్ల డీటీసీఎస్ నవీన్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరి రిమాండ్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7: నగరానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలిక కుటుంబసభ్యులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శాస్త్రీరోడ్‌కు చెందిన మహ్మద్ సిరాజొద్దీన్‌ను అరెస్టు చేశారు. శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

సహజ వనరులను కొల్లగొడుతున్న మోదీ ప్రభుత్వం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని సహజ వనరులను కొల్లగొడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన పార్టీ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్(రంగారెడ్డి), పోటు ప్రసాద్(ఖమ్మం) సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ఆదానీ, అంబానీ, నీరవ్ మోదీ బ్యాంకుల్లో అప్పులు తీసుకొని ఎగ్గొట్టి విదేశాల్లో దాక్కున్నారన్నారు. నీరవ్ మోదీని అప్పగించాలంటూ బ్రిటన్ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సంవత్సరకాలం పూర్తి చేసుకుందని సంబరాలు చేసుకుంటున్నారని, ఏడాదిలో రాష్ట్రంలో ఏం చేశారని ఒక్కసారి నెమరు వేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు మీసం లక్ష్మన్, కడారి రాములు, కేవీ అనసూయ, మల్లేశం, తిరుపతిరెడ్డి, విజయ్, రంజిత్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు



హైకోర్టుకు జడ్జికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈఈవో, కోడెమొక్కు చెల్లించుకుంటున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరావు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అధికారులు రాజన్న ప్రసాదాన్ని అందించారు.

రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలు

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్ లోకి వెళ్తుండగా కరీంనగర్ వైపు నుంచి రాజీవ్ రహదారిపై వేగంగా వచ్చిన ఓ వాహనం బస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామం వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రా మంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ తోట తిరుపతి శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- పలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్న రాష్ట్రప్రభుత్వం
- తక్కువ పెట్టుబడి.. చీడపీడల బాధ లేదు
- టన్ను గెలలకు రూ. 20,413


వేగురుపల్లిలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంట



మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో ఏడు క్లస్టర్లలో 72 మంది రైతులు 250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల సబ్సిడీలు అందుతుండడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఒక్కసారి దిగుబడి ప్రారంభమైతే 40 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. కూలీలు, కోతులు, పశువుల సమస్య లేకపోవడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

● సబ్సిడీలు.. ప్రోత్సాహకాలు

ఎకరం భూమిలో సుమారు 57 మొక్కలను నాటవచ్చు. వీటి సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం డ్రిప్ సిస్టంపై ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఐదు ఎకరాల్లోపు సాగు చేస్తున్న బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఐదు ఎకరాలపై సాగు చేసిన రైతులకు 80 శాతం సబ్సిడీ కాగా 20 శాతం జీఎస్టీని సదరు రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్నకారు రైతుల తోటల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా మొక్కలకు గుంతలు తవ్వి ఎరువులను ఉచితంగా అందజేస్తారు. మొక్కలను సంరక్షించడానికి ఎకరాన రైతుకు ఏటా 4,200 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది.


మానకొండూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● ఎకరానికి రూ. 1.5 లక్షల ఆదాయం

ఆయిల్‌పామ్ 30 నుంచి 40 ఏళ్ల పంట కాగా 36 నెలలకు పంట కోతకు వస్తుంది. ఎకరాన 10 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు 20,413 రూపాయల ధర ఉండడంతో రెండు లక్షల విలువైన పంట దిగుబడి వస్తుంది. పెట్టుబడులు, కూలీ ఖర్చులు ఎకరానికి 50 వేల రూపాయలు పోను రైతులకు సుమారు లక్షన్నర ఆదాయం వస్తుంది. పత్తి, మిర్చి, వరి ఇతర పంటల్లాగా ఆయిల్‌పామ్‌కు చీడపీడల బాధలేదు. ఎలాంటి వాతవరణ పరిస్థితులనైనా తట్టుకోవడం ఈ పంట ప్రత్యేకత. కోతులు ఇతర పశువులు ఈ గెలలను, చెట్లను ముట్టుకోవు. తక్కువ నీళ్ల ఉన్నప్పటికి డ్రిప్ సాయంతో సాగు చేయవచ్చు. దళారుల సమస్య లేకుండా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకవస్తే వారే కాంటా వేసి సరుకును తీసుకుంటారు. రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ అవుతాయి. ఆయిల్‌పామ్‌కు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తుంది. ఆయిల్‌పామ్ చెట్ల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు.

ఏడెకరాల్లో సాగు

- నందికొండ ముత్తారెడ్డి, రైతు, వేగురుపల్లి



నాకు గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వరి, ఆరుతడి పంటలను సాగు చేసేవాడిని. ఈ పంటలను సాగు చేయడానికి పెట్టుబడితో పాటు కూలీల కొరత ఉండేది. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. ముందుగా ఐదున్నర ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశాను. మరో ఏడాదికి మిగతా ఎకరంన్నర భూమిలో మొక్కలను పెట్టాం. నీరు, కూలీల అవసరం తగ్గింది. పెట్టుబడి తగ్గింది. ఆయిల్ పామ్ మొక్కల మధ్య అంతర పంటలైన కూరగాయలు, బంతిపూలు సాగు చేశాము. మంచి లాభాలు వచ్చాయి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ చెట్లకు గెలలు వచ్చి కోత దశకు వచ్చాయి. మార్కెట్లో ధర బాగుందని సంబంధిత అధికారులు చెప్పారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

- రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ధర్నా

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హెచ్చరించారు. వరంగల్ జిల్లా గీసుకొండలో కోడెలు పట్టుబడటంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విడివిడిగా రాజన్న ఆలయంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయ ఈవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో భక్తులు రాజన్నకు చెల్లించుకునే కోడెలను వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి అనుచరుడైన రాంబాబుకు అందజేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్, వంగల శ్రీకాంత్, నీలం శేఖర్, గోలి మహేష్, మారం కుమార్, వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆలయ ఈవో కార్యాలయంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాజన్న కోడెలు పక్కదారి పట్టాయని వస్తున్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సగ్గు రాహుల్, నామాల శేఖర్, పిస్సింటి హన్మాండ్లు, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● వేములవాడ రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్పందిస్తూ కోడెలు పక్కదారి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఈవో వినోద్‌రెడ్డి

ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గంభీరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి ధర్నా చేశారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలలో ఏడు తరగతులకు ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతో చదువులు ముందుకు సాగడం లేదన్నారు. ముగ్గురిలో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపేందుకు మౌకిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపే అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆందోళన చేశామన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకెళ్లారు.

ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు డీసీపీ రాజు

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ(అడ్మిన్) సీ రాజు శనివారం తనిఖీలు జరిపారు. సాయుధ దళ పోలీసు కవాతు తరువాత టర్న్ అవుట్ పరిశీలన జరిపారు. సెర్మినల్ డ్రిల్ సిబ్బంది పరేడ్ తనిఖీ చేశారు. ఏఆర్ సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఏఆర్ సిబ్బంది సివిల్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారని, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమానంగా పని చేస్తున్నారన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఆర్ఐ ఆఫీస్, రికార్డు రూమ్, బెల్లప్ ఆర్మ్స్, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేషం, సంపత్, ఎస్ఐలు పాల్గొన్నారు.

'శాతవాహన'లో ఉద్యోగాల పండుగ

- మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన - 50 కంపెనీలు హాజరు
- 427 మందికి ఉద్యోగాలు



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

గణేశ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో శాతవాహన యూనివర్సిటీలో శనివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాకు విశేష స్పందన లభించింది. 50 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ ఆధికారి చిరంజీవులు మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో ఇంతపెద్ద జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగం ఉరికే రాదని, కష్టపడి చదవాలని సూచించారు. ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మొట్టమొదటి సారిగా జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. రెండువేల పైచిలుకు విద్యార్థులు ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. యూనివర్సిటీలో సంవత్సరంలో రెండుసార్లు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాలో 2,649 మంది పాల్గొనగా 427 మంది నియామక పత్రాలు అందుకున్నారన్నారు. 845 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు



● ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది

పావని, మంథని జేఎన్టీయూ

యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాకు అవకాశం కల్పించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు.

● పలు అంశాలపై అవగాహన కల్పించారు..

జి సాయిరిషీంద్ర, కరీంనగర్



జాబ్ మేళాలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇది నాలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. మంచి కంపెనీలో ఉద్యోగం పొందాను. ఆనందంగా ఉంది.



● మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది..

వైష్ణవి, హైదరాబాద్

ఉద్యోగానికి వెళ్లినప్పుడు ఇంటర్వ్యూదే ముఖ్యపాత్ర. ఇంటర్వ్యూలో ఎలా మాట్లాడాలి.. రెస్యూమ్ ఎలా తయారు చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. మంచి కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

● ప్రముఖ కంపెనీలు.. ఒకే వేదికపై..

- డి తేజవర్ధన్



రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలు యూనివర్సిటీలో ఒకే వేదికపై జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ మేళా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇంటర్వ్యూలకు హైదరాబాద్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. ఇక్కడికే అన్ని ప్రముఖ కంపెనీలు రావడంతో ఆర్థిక భారం తగ్గింది.



● నా కల నెరవేరింది..

- టి అరుణ్, శాతవాహన యూనివర్సిటీ

నేను శాతవాహన యూనివర్సిటీలో పీజీ చేస్తున్నాను. ఇక్కడే ఇంత పెద్ద జాబ్ మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. చదువు పూర్తికాగానే హైదరాబాద్ వెళ్లి జాబ్ చేద్దాం అనుకున్నా. ఈ మేళాలో ఉద్యోగం సాధించి నా కల నెరవేర్చుకున్నా..

ఆదివారం ప్రత్యేకం



శిథిలంగా మిగిలిన ఎడ్ల బండి చక్రాలు



మల్రిగడ్డలో ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ప్రదర్శన కోసం షెడ్డులో నిలిపిన ఎడ్ల బండి

కనుమరుగవుతున్న కచ్చురం

యంత్రాల రాకతో కనిపించని ఎడ్లబండ్లు

● శిథిలాలుగా మిగిలిపోయిన పరిస్థితి

ఒకప్పుడు పల్లెటూరుకు వెళ్తే ఎడ్ల బండ్లు కనిపించేవి. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతో గొప్పవాళ్లు అనేవాళ్లు. జోడెడ్ల బండి ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. ప్రధానంగా రైతులు వ్యవసాయ పనులకు రవాణా సాధనంగా వినియోగించేవారు. అదే బండిపై ఇంటిల్లిపాదీ జాతర్లకు, శుభకార్యాలకు వెళ్లేవారు. బయల్దేరే ముందు బండిని రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేనివాళ్లు వారి అవసరాలకు అడిగి తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఏదో ఒక పల్లెటూరిలో ఒకటి రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. అన్నదాతలకు బతుకునిచ్చిన కచ్చురం కాలక్రమేణా వైభవాన్ని కోల్పోయింది.

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండ్లు చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలాయి. సరైన రహదారి, రవాణాకు అంతగా వాహనాలు లేని రోజుల్లో కాడెద్దుల బండే రవాణా సాధనం. రైతులు పొద్దున్నే సద్దిగట్టుకొని ఎడ్లబండిపై పొలాలకు వెళ్లేవారు. ఎరువులు, విత్తనాలు, గ్రాసం, ఇలా దేన్నైనా ఎడ్లబండి మీదే తరలించేవాళ్లు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో ఎడ్ల బండ్లకు ఫుల్ డిమాండ్ ఉండేది. సీజన్ ఆరంభంలో పొలాలకు పెంట తరలించడం మొదటి పని. పొలం దున్నేందుకు అవసరమైన నాగళ్లు, గొర్రులను రైతులు ఎడ్లబండిపైనే తీసుకెళ్లేవారు. పండిన వడ్లు పట్టించేందుకు రైస్ మిల్లుకు వెళ్లే రవాణా సాధనమూ ఎడ్లబండే. ఇంట్లోకి కావాల్సిన వంట చెరుకు, పశువుల పాకలు, ఇల్లు కట్టేందుకు అవసరమైన కలప ఎడ్లబండ్ల పైనే తెచ్చేవారు. నాడు రవాణా సౌకర్యం అంతంతమాత్రం కాబట్టి ఇంటిల్లిపాదీ జాతరకు వెళ్లాలంటే ఎడ్లబండే బస్సు, కారు అన్నీ. బయల్దేరే ముందు బండిని రంగు రంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేని వారు అద్దెకు ఎడ్లబండి తీసుకెళ్లేవారు. కలపతోనే కమ్మరులు చక్రాలు, బాడీతోపాటు బండికి అవసరమయ్యే విడి భాగాల తయారు చేసేవారు. వడ్రంగులు, కమ్మరుల పని ప్రదేశాలు హడావుడిగా కనిపించేవి. ఎడ్ల బండి తయారీకి అప్పట్లో చాలా తక్కువ ఖర్చయ్యేది. తయారీకి ఇరుసు, ఖానీ, నొగళ్లు, గొలుసు, సాయిసీలా, బడితెలు, కోలు అవసరమవుతాయి ఇప్పుడు అక్కడక్కడా ఇనుప చక్రాలతో తయారు చేసిన బండ్లు కనిపిస్తున్నాయి. ట్రాక్టర్ వచ్చి ఎడ్ల బండి మనుగడను తొక్కేసింది. క్రమక్రమంగా 'కాడెడ్ల కచ్చరం' కాలంలో కనుమరుగవుతోంది. ఎడ్ల బండి అంటే అప్పట్లో పిల్లల్లో క్రేజ్ ఉండేది. పెద్దలు ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్నప్పుడు పిల్లలు కూడా సరదాగా ఎడ్ల బండి ఎక్కేవారు. ఇప్పటి పిల్లలకు ఎడ్లబండి అంటే ఏమిటో తెలియని పరిస్థితి. ఎడ్లు, ఎడ్లబండితోనే పొలం పనులు మొదలయ్యేవి. ఆ రోజులు మళ్లీ రావు. కాలం మారుతున్న కొద్దీ ఎడ్లబండ్ల సంస్కృతీ పోతున్నది.



మూడపల్లిలో ఓ ఇంట్లో శిథిలమైన ఎడ్లబండి

ఎడ్లబండి ఇంటికి కళ తెచ్చేది

- ఇందూరి హరిబాబు, మల్రిగడ్డ



నాడు గ్రామాల్లో ఎడ్లబండ్లు ఎక్కువగా కనిపించేవి. ఎడ్లబండి ఉన్న ఇంటికి ప్రత్యేక ఆకర్షణ. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతోగొప్ప. ఇంటికి కళ తెచ్చేది. ఎడ్ల బండి ఉన్న ఇంట్లో రెండు ఎడ్లు ఉండేవి. ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండి మీదే వెళ్లేవాళ్లు, ఇప్పుడు అక్కడక్కడా ఒకటీ రెండు బండ్లు కనిపిస్తున్నాయి. అవి కూడా ఇనుముతో తయారు చేసినవి. కొన్ని టైరు బండ్లు. రాబోయే తరానికి ఎడ్ల బండి ఎలా ఉంటదనేది తెలియడం కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసిన పాతకాలంనాటి ఎండ్లబండిని ప్రదర్శన కోసం ఉంచాను.

ట్రేడ్ లైసెన్స్‌ల పేర సైబర్ నేరస్థుల ఫోన్ కాల్స్

- మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ వ్యాపారులను నమ్మించే యత్నం

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్థులు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇన్నాళ్లు లాటరీలు, పార్సిళ్లు, బ్యాంకులు, ఉద్యోగాల పేరుతో మోసగించిన సైబర్ నేరస్థులు ఇప్పుడు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాల్లో చిన్నచిన్న వ్యాపారులకు సైతం ప్రభుత్వాధికారుల పేర ఫోన్ చేసి బెదిరిస్తూ దండుకుంటున్నారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నుంచి మాట్లాడుతున్నామంటూ శనివారం గోదావరిఖని పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసిన సైబర్ నేరస్థులు ట్రేడ్‌లైసెన్స్‌లు ఒకే దశ చెల్లించే అవకాశం వచ్చిందని, వెంటనే తాము చెప్పిన నంబర్‌కు ఫోన్ చేస్తే అప్‌డేట్ చేస్తామని, లేదంటే 45 రోజులు షాపు సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు గురిచేశారు.

శనివారం మాతంగి కాంప్లెక్స్‌లోని ఒక సూపర్ మార్కెట్ యజమానికి, కళ్యాణ్‌నగర్ లోని మరో ఏజెన్సీ నిర్వాహకుడిగా, లక్ష్మీనగర్‌లోని మరో నలుగురు వ్యాపారులకు ఇదే తరహా ఫోన్లు వచ్చాయి. షాపు పేరు, యజమాని పేరు చెబుతూ ఒకే దఫా 9990 రూపాయలు చెల్లిస్తే భవిష్యత్‌లో ట్రేడ్ లైసెన్స్ చెల్లించే అవసరం ఉండదని, నగరంలో చాలా మంది వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారంటూ నమ్మించే యత్నం చేశారు. గత సంవత్సరం కూడా ఇదే తరహా పలువురు వ్యాపారుల నుంచి సైబర్‌నేరస్థులు డబ్బులు దండుకున్నారు. కాగా బీహార్, గుర్గావ్ తదితర ప్రాంతాల నుంచి సైబర్ నేరస్థులు తెలుగులో మాట్లాడుతూ ఈ తరహా మోసాలకు పాల్పడినట్టు తెలిసింది.

రోడ్డుపై రూ. మూడు లక్షలు

పోలీసులకు అప్పగించిన వ్యాపారస్తులు



సీఐకి డబ్బు అప్పగిస్తున్న మారుతి, కిరణ్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో రోడ్డుపై పడి ఉన్న మూడు లక్షల నగదును కొందరు వ్యాపారులు గమనించి వెంటనే వాటిని పోలీసులకు అప్పజెప్పారు. పట్టణంలోని పాత బస్టాండ్ చావిడికి వెళ్లే మార్గంలో మారుతి మసాల దుకాణం ముందు 500 రూపాయల నోట్ల కట్టలు (3 లక్షల రూపాయలు) పడి ఉండడాన్ని షాపు యజమానులు సామా మారుతి, కంభంపాటి కిరణ్‌కుమార్ గమనించారు. వెంటనే వాటిని మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్ రెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరివైన డబ్బులు పోగొట్టుకుంటే సరైన ఆధారాలు సమర్పించి డబ్బులు తీసుకెళ్లాలని కోరారు. మానవత్వంతో డబ్బులు అప్పగించిన మారుతి, కిరణ్‌ను సీఐ అభినందించారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధుర్ గ్రామానికి చెందిన తెలుకంటి శ్యామల(55) శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామలకు పదేళ్ల నుంచి మానసిక స్థితి బాగలేదు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు విష్ణువర్ధన్, వినయ్, గైని నక్షత్ర జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.



క్రీడాకారులతో అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



గణిత ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని శ్రీహిత

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన ఇన్‌స్పైర్ పోటీల్లో తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీహిత మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలు, చతుర్భుజంలోని నాలుగు కోణాలు 360 డిగ్రీలని కార్డులతో ప్రయోగపూర్వకంగా చేసిన ప్రదర్శన జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం మోటూరి రవీందర్ తెలిపారు. గైడ్ టీచర్‌గా గణిత ఉపాధ్యాయుడు యాగండ్ల గంగాధర్ వ్యవహరించారు. విద్యార్థిని శ్రీహితను తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారు రాంప్రసాద్, డీసీఈబి కార్యదర్శి మురళీమనోహరాచారి, పరీక్షల కమీషనర్ రాజమౌళి, ఎంఈవో లోకిని శ్రీనివాస్ అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అయ్యప్ప స్వాములు



మల్లన్న జాతరలో నృత్యాలు చేస్తున్న శివసత్తులు



మల్లన్న బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని జ్ఞాన సరస్వతిమాత శనైశ్చర సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అర్చన అభిషేక కార్యాక్రమాలను నిర్వహించి ప్రత్యేక వేదిక ద్వారా వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు చేసిన భజన కార్యక్రమంతో ఆలయ ఆవరణ మారుమోగింది. మెదట సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు తీసుకరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భక్తులకు గుండేటి నాగరాజు - రాధ దంపతులు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, దేవాలయ కమీటి సభ్యులు తోట రాజు, కాసు కాంగ్రి జుంబర్తి రమేష్, గట్ట ఆనంద్, నిమిషకవి నాగరాజు, మరిపల్లి రవీగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

కోరుట్ల రూరల్: షష్ఠి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అయిపూర్ గ్రామంలో మల్లన్న జాతర మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. యాదవ సాంప్రదాయ ప్రకారం ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై మల్లన్న దేవుడికి పరిసర గ్రామాల భక్తులు పూజలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని గ్రామం నుంచి మల్లన్న ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాల శోభాయాత్రలో శివసత్తులు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాలను మల్లన్నకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ పిడుగు రాధ- సందయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిని అభినందించిన సీఎం



శంకర్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మల్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టుకు చెందిన ముత్యం శంకర్ కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లోని సీఎం ఇంట్లో శంకర్ తదితరులు తమ ఎన్నిక సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కూడా కలువగా పుష్పగుచ్ఛం అందించి శంకర్‌ను అభినందించారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపాడు

దివ్యాంగుల అభివృద్ధికి చేయూతనివ్వాలి

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూతనివ్వాలని మండల విద్యాధికారి మేకల చంద్రశేఖర్ కోరారు. శనివారం పట్టణంలోని గాజులపేటలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని విద్యాలో రాణించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుకోవెల శ్యాంసుందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుశీల, యాదగిరి పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



పట్టణంలో మహిళా పొదుపు సంఘాలకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల్లో శనివారం కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకే జీ ద్వారా మంజూరు చేసిన రూ 5,63,50,000 చెక్కును ఆయన అందించారు. ఇందిరా మహిళా శక్తి మూడు గ్రూపులకు రూ 68,00,000 రుణాలు పంపిణీ చేశారు. పట్టణ వీధి వ్యాపారులకు రూ 23,00,000 చెక్కును ఆయన అందించారు. అలాగే కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలు ఖచ్చి తంగా అమలు చేస్తామన్నారు. ప్రస్తుత వర్షాకాలం పంటలో ధాన్యం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ధర్మపురిలో నైట్ కాలేజీని పున: ప్రారంభం చేసినామని, చెగ్యాం భూ నిర్వాసితులకు రూ 18 వేల కోట్లు పరిహారం అందించినట్లు వివరించారు. ఇంటి గ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయించి, నిర్మాణం కోసం 25 ఎకరాల స్థలా న్ని కూడ సేకరించామన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మా ట్లాడుతూ సన్న వరి ధాన్యం విక్రయించిన రైతులు 227 మందికి రూ 1.41 కోట్లు బోనస్ అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సంక్రాంతి లోపు సర్వే పూర్తి చేసి నిరుపేదలకు ఇళ్ల అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి, జగిత్యాల ఆర్‌డీవో మదుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య, తహసీల్దార్ కృష్ణచైతన్య, కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, సీడీపీవో శ్రీవాణి, మున్సిపల్, ఏఎంసీ వైస్‌చైర్మన్లు ఇందారపు రామయ్య, సంగ నర్సింహులు, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం పోరాడుతూనే ఉంటా..

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, డిసెంబరు, 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంతో పోరాడుతూనే ఉంటానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో మంజూ రైన సీఎంఆర్ఎ చెక్కులను లబ్ధిదా రులకు స్థానిక నాయకులతో కలిసి అందజేశారు.

అనంతరం మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ నూతన భవన నిర్మాణానికి బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ ద్వారా మంజూరైన మూడు లక్షల రూపాయల విలు వల గల ప్రొసిండింగ్ పత్రాలను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీల ను నెరవేర్చేలా ప్రజాపక్షం తరుపున పోరాడుతానన్నారు. నియోజక వర్గంలోని ఎలాంటి సమస్యలను దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికార యంత్రాం గతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక మంలో నాయకులు, లబ్ధిదారులు, ఆర్‌ఎంపీ, పీఎంపీ నా యకులు, పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి

కొడిమ్యాల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఎస్సై ఎస్. సందీప్ అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్-24 గ్రామ స్థాయి క్రీడలు ప్రారంభమైనాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తెలంగాణాలో క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. అంతక ముందు ఎంఈవో ఎ. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీని రూపొందించిందన్నారు. ఉత్తమ ప్రతిభకనబర్చిన వారికి శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు వీలు కలిపించిందన్నారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర, క్రీడల నిర్వహకులు పీడీ. బూట్ల రాజ మల్లయ్య, పీడీ అనూప్‌రెడ్డి, ఉపాధ్యాయులు మన్మథ రెడ్డి, తిరుపతిరెడ్డి, అంజయ్య, సీనియర్ క్రీడాకారులు కృష్ణంరాజు, పోచమల్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బిల్లులు వచ్చేదెన్నడో..?

(3వ పేజీ తరువాయి)

సుమారు 10 వేలకు పైగా పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,566 మంది వంట కార్మికులు పని చేస్తున్నారు. గుడ్డు బిల్లు సపరేటుగా ఇస్తున్నారు. జిల్లాలో నెలకు సుమారు రూ. కోటి వరకు మధ్యాహ్న బిల్లులు అవుతాయని అంచనా ఉంది. అయితే 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు వంట కార్మికుల బిల్లులు సెప్టెంబరు వరకు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బిల్లులు ఆగస్టు వరకు, 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వంట కార్మిక బిల్లులు సెప్టెంబరు వరకు వచ్చినట్లు కార్మి కులు అంటున్నారు. రెండు, మూడు నెలలుగా బిల్లులు రావడం లేదని వాపోతున్నారు.

● గౌరవ వేతనం పెంచాలని డిమాండ్..

జిల్లాలో సుమారు 1,566 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ. వేయి రూపాయల చొప్పున ప్రభుత్వం గౌరవ వేతనం అందిస్తుంది. గత ప్రభుత్వం మరో రూ. 2 వేలు ప్రకటించడంతో రూ. 3 వేల వేతనం అందిస్తున్నారు. వారికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని అంటున్నారు. గౌరవ వేత నాన్ని రూ. 10,500 పెంచి ప్రతీ నెల 5వ తేదీలోపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

●పెరిగిన గుడ్డు ధరతో సతమతం..

మెను ప్రకారం వారంలో మూడు సార్లు కోడిగుడ్లను అందించాలి. ప్రస్తుతం కోడిగుడ్లను ధరలకు రెక్కలు రావడంతో ఏజెన్సీల నిర్వాహకులు సతమతమవుతున్నారు. ప్రభుతం ఒక కోడిగుడ్డుకు రూ. 5 చెల్లిస్తుంది. అయితే మార్కెట్‌లో గుడ్డు ధర సుమారు రూ. 6 నుంచి రూ. 7 వరకు పలుకుతోంది. అలాగే కూరగాయల ధరలు చుక్కలనంటాయి. పెరిగిన నిత్యావసర సరుకులతో గిట్టుబాటు కావడం లేదని కార్మికులు వాపోతున్నారు.

●ఆందోళన బాటలో వంట కార్మికులు...

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులు సమస్యల పరిష్కారానికి ఆందోళన బాటను ఎంచుకుంటున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ గేటు వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుంటే భోజనం నిలిపివేస్తామని తెలిపారు. 31వ తేదిలోగా సమస్యలు పరిష్కరించకుంటే కార్యాచరణ ప్రకటిస్తామని అంటున్నారు.

అప్పుల పాలవుతున్నాం

కొంకా భాగ్యలక్ష్మీ, వంట కార్మిక సంఘం నాయకురాలు



మధ్యాహ్న భోజన బిల్లులు సక్రమంగా అందడం లేదు. బిల్లులు సక్రమంగా అందక పోవడంతో కిరాణ షాపుల్లో అప్పులు పెరిగి పోతున్నాయి. కొందరు వ్యాపారులు సరుకులు ఇవ్వడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. గౌరవ వేతనం రూ. 3 వేలకు పెంచినప్పటికీ ఏ నెలకు ఆ నెల రావడం లేదు. పెండింగ్ బిల్లులు చెల్లించాలి.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తప్పదు

చిట్టనోజు గంగాధర్, వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు



వంట కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనం చెల్లించాలి. గౌరవ వేతనాన్ని రూ. 10,500కు పెంచాలి. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, వేతనాలు అందించాలి. కోడి గుడ్ల ధర రూ. 5 నుంచి రూ. 7 వరకు పెంచి బిల్లులు చెల్లించాలి.

అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

సారంగాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిపించిన జగిత్యాల ప్రజల రుణం అభివృద్ధితో తీర్చుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని అర్పపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ, 15 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్పపల్లి గ్రామంలో రైతుల సమస్యలను గుర్తించి పటేళ్ల కుంటకు తూమ్ ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం కుంట నిండుకుండను తలపిస్తోందన్నారు. మండలంలో రోడ్ల అభివృద్ధికి రూ కోటి 38 లక్షల నిధులు ముంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ నర్సింహరెడ్డి, నాయకులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రావు, నాయకులు ప్రభాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.



అర్పపల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

ధర్మపురిలో బీజేపీ నాయకుల ధర్నా

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో ఏర్పాటు చేసిన కాషాయ జెండాలు, బీజేపీ జెండాలను మున్సిపల్ శాఖ తొలగించి డంపింగ్ యార్డులో పారవేసినందులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం బీజేపీ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

అనంతరం గేటు ఎదుట కొంత సేపు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బెజ్జారపు లవణ్ మాట్లాడుతూ హిందువులు పరమ పవిత్రంగా భావించే కాషాయ ధ్వజాన్ని డంపింగ్ యార్డులో పడవేయడం సిగ్గు చేటని అన్నారు. వెంటనే కాషాయ జెండాలను తీసుక వచ్చి భద్రపరచాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీని వాస్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, తిరుమన్ దాసు సత్యనారాయణ, నరెడ్ల శంకర్, అప్పం మల్లేష్, వెలగం దుల ప్రణీత్, దివిటి శ్రీధర్, సూరజ్, శివసాయి, స్తంభంకాడి శ్యాంసుందర్, నవీన్, అనిల్, శ్రీనివాస్, రాజేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది

టీపీసీసీ డెలిగేట్ డైరెక్టర్ సుజిత్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ డెలిగేట్ సుజిత్‌రావు

మల్లాపూర్, డిసెంబరు, 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల్లో నమ్మకం పెరిగిందని టీపీసీసీ డెలిగేట్ డైరెక్టర్ సుజిత్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రైతుల సంక్షేమంతో పాటు అన్ని వర్గాల ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. సుజిత్‌రావుతో పాటు మొదటి సారి వచ్చిన మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్‌లను నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, వాకిటి సత్యంరెడ్డి, రుత్త నారాయణ, ఎనడ్ల రాములు, గంధం రాజేష్, రాజేందర్, పాల్గొన్నారు.

న్యాయవాదులుగా తండ్రీ కూతురు



తండ్రి,కూతురు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఎలిగేటి శ్రీనివాస్ ఆయన కూతురు కావ్య ఇద్దరు ఒకే సారి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి శనివారం హైదారాబాద్‌లోని తెలంగాణ బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌లుగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. శ్రీనివాస్ శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. కావ్య న్యూఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు తప్పవు

కోరుట్ల, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : నిబంధలకు విరుద్ధంగా ప్లాస్టిక్ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి దుకాణదారులను హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు వ్యాపార సంస్థలపై సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆశోక్ ఆధ్వర్యంలో దాడులను నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిలువలను స్వాధీనం చేసుకోని సుమారు రూ. 6000 వరకు జరిమానాలు విధించినట్లు అధికారులు ప్రకటించారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

కోరుట్ల, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్, బెడ్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు ఎంఐఎం నాయకులు వినతి పత్రం అందించారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు వాజిద్, రహీం, హఫీజ్, సమీర్, సురేష్ పాల్గొన్నారు.

సమాజ సేవలో నేరెళ్ల 'స్నేహ మిత్ర యూత్'

●ఓ వైపు ఉన్నత చదువు మరో వైపు అభివృద్ధి

●14 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత విద్య, విజ్ఞానంతో పాటు సామాజిక సేవల్లో భాగస్వాములవుతున్నారు. 'నా కోసం కాదు మీ కోసం' అంటూ ప్రజా క్షేత్రంలో పలు సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. ఓ వైపు ఉన్నత చదువు మరొక వైపు గ్రామాభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన జాజాల రమేష్ తన తోటి మిత్రులతో కలిసి 2010లో స్నేహ మిత్ర యూత్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 40 మంది యువకులతో కలిసి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తూ వివిధ స్థాయిలో పనులు చేసుకుంటూ పలువురు ఉద్యోగాలు సాధించారు. గ్రామంలో ఆదర్శంగా నిలుస్తున్నారు.



నేరెళ్ల గ్రామంలో స్నేహ మిత్ర యూత్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిర్మించిన ఇల్లును ప్రారంభిస్తున్న జగిత్యాల అప్పటి డీఎస్పీ భద్రయ్య

స్నేహ మిత్ర యూత్ చేపట్టిన సేవా కార్యక్రమాలు

స్నేహ మిత్ర యూత్ సభ్యులు వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలి వేంద్రాలు ఏర్పాటు చేసి కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటారు. రక్త దాన శిబిరాలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి అందించారు. నిరుపేదలు మృతి చెందితే అంత్యక్రియల నిమిత్తం ఆర్థి కసాయం చేశారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, దాతల సహకారంతో నిరుపేద కుటుంబానికి ఇళ్ల నిర్మించారు. ఓటు అమ్ము కోవద్దు అంటూ ఓటు హక్కు విలువపై పోస్టర్లు ముద్రించి ప్రచారం చేస్తూ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అం దించారు. గ్రామంలోని పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

జాజాల రమేష్, న్యాయవాది, స్నేహ మిత్ర యూత్ వ్యవస్థాపకులు



ప్రజలకు తమ వంతుగా ఏదో విధంగా సహాయం చేయాలనే ఆలోచనతో తోటి యువతతో కలిసి స్నేహ మిత్ర యూత్ ఏర్పాటు చేశాను. యూత్ సభ్యులు, ప్రజల సహకారంతో సాధ్యమైనంత వరకు నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాను. 14 ఏళ్లగా పలు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుక వెళ్లి పరిష్కారానికి కృషి చేశాను.

సేవ చేయడం ఆనందంగా ఉంది

శ్యామల మధూకర్, స్నేహ మిత్ర యూత్ ఉపాధ్యక్షుడు



తోటి మిత్రులతో కలిసి సేవ చేయడం ఆనందంగా ఉంది. గ్రామాభివృద్ధి కోసం తాను పాటు పడుతున్నాను. నిరుపేదలకు మేమున్నాం అంటూ ఆదుకోవడం మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. యువత చేస్తున్న సేవా కార్యక్రమాలకు నాయకులు, ప్రజా ప్రతినిధులు సహకరిస్తే మరింత అభివృద్ధి చేయవచ్చు. మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందకు వెళ్తాము.

ప్రతీ ఒక్కరు బీమా చేయించుకోవాలి

కొడిమ్యాల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మదుసూధన్ కోరారు. శనివారం మండలంలోని నాచుపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అక్టోబరు 15నుంచి జనవరి 15వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్సీ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండి 70లోపు వయస్సు గల వారు బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా కలిగి ఉండి ప్రధాన మంత్రి బీమా జీవనజ్యోతి, బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో బీమా చేయించుకోవాలన్నారు. ఈ అవగాహన శిబిరంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు శంకర్, నరేష్, వివిధ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

బీర్‌పూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను కాపాడాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని దర్మపురి ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనాథ్ అన్నారు. అడవిలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా వాటి నివారణపై గ్రామాలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలం లోని తాళ్ల దర్మారం గ్రామంలో శనివారం అటవీ ప్రాంతాలలో జరుగుతున్న అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎఫ్ ఆర్ వో శ్రీనాథ్ మాట్లాడుతూ అడవికి నిప్పు తగలడం అంటే అది మాన వాళికి ముప్పు వాటిల్లినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు రాథోడ్, ప్రకాష్, గంగారాం, బీట్‌ఆఫీ సర్లు కిరణ్, నవీన్, మాజీ సర్పంచ్ నల్ల మహిపాల్‌రెడ్డి, నాయకులు జోగి రెడ్డి, భూమేష్, బేష్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల : అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కొడిమ్యాల రేంజర్ గులాం మొయినొద్దీన్ అన్నారు.

శనివారం మండలంలోని సండ్రల్లపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థులకు వన సంరక్షణపై అవగాహన కలిపించారు. రేజర్ మాట్లాడుతూ అడవికి నిప్పు పెడితే మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ జి. రమేష్, కొండగట్టు డిప్యూటీ రేంజర్ ఆర్. మోనిక, బీట్ అధికారి ఇ. ప్రవీణ్, బేస్ క్యాంప్ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మెట్‌పల్లి టౌన్: టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అమరేందర్ రెడ్డిని, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికైన మహమ్మద్‌ను, టిజివో ఉపాధ్యక్షులుగా ఎన్నికైన అకౌంట్స్ అధికారి విజేందర్‌ను శనివారం టీఎన్జీవోస్ ఉద్యోగుల సమక్షంలో ఇరిగే షన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

బీర్‌పూర్: మండలంలోని వివిధ గ్రామాల స్థాయి క్రీడాకారుల ఎంపిక శుక్రవారం పూర్తి అయింది. ఓపెన్ కేటగిరిలో మెన్ అండ్ ఉమెన్ కోకో, ఓపెన్ కేటగిరి మెన్ అండ్ ఉమెన్, వాలీబాల్ అండర్ 18 అథ్లెటిక్స్ మెన్ ఉమెన్ అండర్ 18లో ఎంపిక పోటీలు జరిగాయి. ఎంపికైన క్రీడాకారిని, క్రీడాకారులు 10, 11, 12 తేదీలలో జరిగే మండల స్థాయి క్రీడలలో పాల్గొననున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ దేవ ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 10 వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల బీర్‌పూర్‌లో ఎస్‌జీఎఫ్ కన్వీనర్ పీడీ లక్ష్మన్ వద్ద హాజరు కావాలని తెలిపారు.

రాయికల్: జగిత్యాలలోని చపురాతన ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని కుమ్మరిపెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడకుంట్ల అభయ్‌రాజ్ బోధనోపకరనాల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించాడు. అంతే కాకుండా రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో శనివారం మెట్‌పల్లి పట్టణ, మండలలకు చెందిన పలువురు లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందజేశారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండలం రాపల్లె మాజీ సర్పంచ్ నల్ల శ్యామ్ దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) జిల్లా కో-ఆర్డినేటర్‌గా శనివారం నియమితులయ్యారు. శ్యామ్‌ను నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ రవి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కె. వేణు శనివారం బాధ్యతలను స్వీకరించారు.

●రెండు రోజుల క్రితం దుబాయ్‌లో గుండె పోటుతో మృతి చెందిన నమిలికొండ గ్రామానికి చెందిన సింగరవేని రమేష్(35) మృత దేహం నమిలికొండ గ్రామానికి చేరింది.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వేంపేట గ్రామంలోని లక్ష్మీవేం కటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే శ్రీశతచండి మహా సుదర్శన నారసింహ యాగం వాల్‌పోస్టర్‌ను దేవాలయ, గ్రామాభివృద్ధి కమిటీ, నాయకులచే